క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



పేదలకు ఇంటి దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలాన్ని పేదలకు కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని రహమత్‌పురంలో సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్లు లేని పేదలకు దరఖాస్తు పత్రాలను అందజేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్, కార్యవర్గ సభ్యుడు చౌళూరు రవికుమార్ మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి కేటాయించాలని, అలాగే ఉపాధి హామీ కింద ఇళ్ల పునాదులు తవ్వడానికి అవకాశం కల్పించాలన్నారు. మార్చి 3న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు తరలిరావాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

మడకశిర: డివైడర్‌పైకి లారీ దూసుకెళ్లిన ఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని పావగడ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. బళ్లారి నుంచి హిందూపురానికి లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. అయితే డివైడర్‌పై నుంచి ముందుకు వెళ్లి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. లారీ మాత్రం కొంత దెబ్బతింది.

ఇంటర్ ప్రశ్నపత్రాలను భద్రపరిచిన అధికారులు

మడకశిర: ఇంటర్ పరీక్షలకు సంబంధించిన మూడు సెట్ల ప్రశ్న పత్రాలను సంబంధిత అధికారులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఇందులో భాగంగానే మూడు సెట్ల ప్రశ్నపత్రాలు రావడంతో మడకశిర, గుడిబండ, అమరాపురం, అగళి పోలీస్‌స్టేషన్లలో ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు భద్రపరిచారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుడిబండ: మండల కేంద్రంలోని శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రొళ్లలో...

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి శివారులో మంగళవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. ఆరుగురు పేకాటరాయుళ్లతో పాటు రూ.4,140 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాటరాయుళ్లను త్వరలోనే మడకశిర కోర్టులో హాజరు పరుస్తామని పేర్కొన్నారు.

పావగడ సమగ్రాభివృద్ధికి చర్యలు



ముందస్తు సభలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

పావగడ: తాలూకాకు కేంద్ర బిందువైన పావగడ పట్టణ ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్‌కు పట్టణ ప్రముఖులు సూచించారు. స్థానిక మున్సిపల్ మీటింగ్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఈ ఏడాది బడ్జెట్ రూప కల్పన ముందస్తు సమావేశంలో పట్టణ ప్రముఖులు సలహాలిచ్చారు. వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని నాలుగు ముఖ ద్వారాల వద్ద స్వాగత బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పలు సర్కిళ్లలో హైటెక్ బస్టాండ్‌లు నిర్మించాలని కోరారు. పావగడకు వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా కోట గోడలను రంగుల తీర్చిదిద్ది... విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు.

మామిడి చెట్లకు నిప్పు



దేమకేతేపల్లి సమీపంలో కాలిపోతున్న మామిడి చెట్లు

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లి సమీపంలో 50 మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఆకతాయలు నిప్పు పెట్టడంతో పూత దశలో ఉన్న చెట్లు కాలిపోయాయని బాధిత రైతు రాజు తెలిపారు. సుమారు రూ.లక్షపైనే నష్టం వాటిల్లిందన్నారు.

మిర్చి రైతు విలవిల



శ్యాపురం వద్ద సాగు చేసిన మిర్చి పంట

- భారీగా పడిపోయిన మిరప ధరలు
- పెట్టుబడి కూడా దక్కడం లేదని అన్నదాతల ఆవేదన
- చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం

రొద్దం: ఆరుగాలం కష్టపడి పండించిన మిరప పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు విలవిలాడుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా దక్కకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రైతులు సంక్షోభంలో ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పెట్టుబడి కూడా దక్కక...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 30 వేల నుంచి రూ.45 వేల దాకా మిరప క్వింటాల్ ధర ఉండేదని, ప్రస్తుతం కేవలం రూ.7 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే ఉందని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో గిట్టుబాటు కాక కోతదశలో ఉన్న మిరపను అన్నదాతలు పొలాల్లో అలాగే వదిలేశారు. ఎకర మిర్చి సాగు చేయడానికి రూ.70 నుంచి రూ.80 వేల దాకా పెట్టుబడులు వస్తాయి. అయితే ప్రస్తుత ధరల ప్రకారం పంట సాగుకు చేసిన ఖర్చు కూడా రైతులకు రావడం లేదు.

అన్నదాతకు అండగా నిలిచిన గత ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల అండగా నిలిచింది. విత్తు దగ్గర నుంచి ఎరువుల వరకూ అన్నింటినీ వారి ఇంటి ముంగిటకు అందించింది. పంట పెట్టుబడికి రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ 13,500 సాయం మంజూరు చేసింది. అలాగే పంటల బీమా ప్రీమియన్ని గత ప్రభుత్వమే రైతుల తరుపున ఏటా చెల్లించింది. పంట నష్టం జరిగితే బీమా పరిహారాన్ని కూడా సకాలంలో బాధిత రైతులకు అందించేది. కూటమి ప్రభుత్వం పంటల బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాలని తెగేసి చెప్పడంతో అన్నదాతల బాధ అంతా ఇంతా కాదు. దీంతో 2019 ముందరి పరిస్థితులే పునరావత్తం అవుతున్నాయని రైతులు చర్చించుకుంటున్నారు.

పెనుకొండ నియోజకవర్గంలో మిర్చి పంట ఇలా...

మండలం	ఎకరాలు
రొద్దం	740
సోమందేపల్లి	59
పరిగి	400
గోరంట్ల	867
పెనుకొండ	230

2,596 ఎకరాల్లో మిర్చి

రొద్దం మండలంలో 740, సోమందేపల్లి 359, పరిగి 400, గోరంట్ల 867, పెనుకొండ మండలంలో 230 ఎకరాల్లో రైతులు మిర్చి పంటను సాగు చేశారు. కొందరు రైతులు ధర లేకపోవడంతో పలు ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. కోల్డ్ స్టోరేజీల్లో ఉంచితే ఎగుమతి, దిగుమతికి కలిపి క్వింటాకు రూ.250 వరకూ రైతులకు అదనంగా ఖర్చు అవుతుంది. మిర్చి ధర గతేడాది మాదిరి ఇప్పుడు కూడా ఉండి ఉంటే గట్టెక్కేవాళ్లమని, కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోవడంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మద్దతు ధర కల్పించాలని వేడుకుంటున్నారు.

రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారు. పంట సాగు చేయడానికి పెట్టిన పెట్టుబడులు దక్కకపోవడంతో తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. కూటమి అధికారంలోకి రాగానే పెట్టుబడి సాయం కింద ఏటా. రూ 20 వేలు ఇస్తామని చెప్పి 9 నెలల గడుస్తున్నా సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు కష్టం వృథా



నేను నాలుగు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. ఎకరా పంట సాగు చేయడానికి రూ 70 వేల నుంచి రూ 80 వేలు అయింది. ఇప్పుడు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. గత ప్రభుత్వంలో ఎండు మిర్చి ధరలు బాగుండేవి. ఈసారి క్వింటా రూ. 13 వేలు కూడా పలకటం లేదు. మద్దతు ధర లేకపోవడంతో లక్షలాది రూపాయిలు పెట్టుబడితో పాటు రైతు కష్టం వృథా అవుతోంది. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర కల్పించాలి.

– రమేష్‌నాయక్, శ్యాపురం, రొద్దం మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



మిర్చి ధర పతనంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా మిర్చి కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలి. మిర్చి మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి. క్వింటాలు రూ. 11 వేల నుంచి రూ.13 వేల వరకూ మాత్రమే ఉంది. ఈ ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాము.

– రాజు, రైతు, రొద్దం

ప్రతిపక్షం లేకుండా అసెంబ్లీ సమావేశాలా?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రతిపక్షం లేకుండా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించినా ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇస్తే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతుందనే భయం ముఖ్యమంత్రి చంద్రబాబుకు పట్టుకుందన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా ప్రజా క్షేత్రంలో సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి రాజ్యాంగం, న్యాయ వ్యవస్థలపై ఏమాత్రం గౌరవం లేదన్నారు. నిజమైన పాలకుడు ఎప్పుడూ ప్రతిపక్షం ఉండాలని కోరుకుంటారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో హత్యలు, దోపిడీలు, మానభంగాలు, తప్పుడు కేసుల నమోదు తదితర ఘటనలు పెరిగాయని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను తిట్టడమే కూటమి నాయకులు పనిగా పెట్టుకున్నారన్నారు.


కేబుల్ అపహరణ

మడకశిర: మండల పరిధిలోని మల్లినాయకనపల్లిలో మంగళవారం తెల్లవారుజామున ఏడు వ్యవసాయ మోటార్లకు అమర్చిన కేబుల్‌ను దొంగలు అపహరించారు. ఉదయాన్నే పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులు సదాశివరెడ్డి, నాగభూషణ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, హనుమంతరాయుడు, మల్లేశప్ప, గోపాల్‌రెడ్డితో పాటు మరొకరి చెందిన వ్యవసాయ బోర్లకు అమర్చిన కేబుల్ దొంగిలించినట్లు బాధిత రైతులు గుర్తించారు. కేబుల్ చోరీకి పాల్పడుతున్న దొంగలను పట్టుకొని శిక్షించాలన్నారు.

'కృత్రిమ కాలు' కోసం పేర్లు నమోదు చేసుకోండి

పెనుకొండ రూరల్: సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వికలాంగుల కోసం ఉచితంగా కృత్రిమ కాలు (ఆర్టిఫిషియల్ లింబ్)కు మార్చి 2వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ నరేష్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కృత్రిమ కాలు కావాల్సిన వారు షఫీవుల్లా 9110353497, నాగముని 8639081464 నంబర్లను సంప్రదించాలన్నారు.

కుంభమేళాలో జపానందస్వామి



స్నానమాచరిస్తున్న జపానందస్వామి

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి జపానంద స్వామిజీ మహా కుంభ మేళాలో మంగళవారం పాల్గొన్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానమాచరించారు. మొత్తం నాలుగు సార్లు కుంభమేళాల్లో పాల్గొని పవిత్ర గంగలో స్నానమాచరించినట్లు పేర్కొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



మరుగుదొడ్లకు ముళ్లకంప వేసిన దృశ్యం

గుడిబండ: ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రానికి వచ్చే ప్రజలు కనీసం మూత్ర విసర్జన చేయాలన్నా కూడా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ సంస్థ రూ.లక్షల నిధులు వెచ్చించి గుడిబండ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లను నిర్మించింది. అయితే వాటికి అన్ని వసతులు ఏర్పాటు చేసినా నిర్వాహణను పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే అనేక మంది ప్రయాణికులు మరుగుదొడ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళ బాధ వర్ణణాతీతంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్లకు మరమ్మతు చేయించడంతో పాటు నిర్వాహణపై దృష్టిపెట్టి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి



ఈశ్వరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం మాజీ ఎమ్మెల్యే, దివంగత రంగనాయకులు సతీమణి ఈశ్వరమ్మ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి .. ఈశ్వరమ్మ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట కౌన్సిలర్లు మద్దన జయప్ప, మహేష్ గౌడ్, నాయకులు రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, బండి రాము, గోవిందరెడ్డి, శభరీష్ గౌడ్, శ్రీనాథ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



సిద్ధేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కోనేరును శుభ్రం చేసిన విద్యార్థులు



కోనేరును శుభ్రం చేస్తున్న విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భారత స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు స్థానిక శివాలయం దగ్గర ఉన్న కోనేరును మంగళవారం శుభ్రం చేశారు. బుధవారం మహాశివరాత్రి పండుగ సందర్భంగా భక్తులు తరలిరానుండటంతో ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చెత్తా, చెదారం లేకుండా చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, స్కౌట్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు అశ్వత్తనారాయణ, రోజ్ మెర్సీరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గుడిబండ: మండల పరిధిలోని బీటీ పల్లి ఎస్సీ కాలనీలో బోరు పాడైపోవడంతో స్థానికులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. స్థానికులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ రంగస్వామి బీటీ పల్లి గ్రామంలో నూతనంగా దాదాపు 620 అడుగుల బోరుబావిని తవ్వించారు. పుష్కలంగా నీరు రావడంతో కాలనీ వాసులకు కొళాయి ద్వారా నీటిని అందించారు. దీంతో స్థానికులు సర్పంచ్ రంగస్వామిని అభినందించారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

చిలమత్తూరు: హిందూపురం పట్టణ పరిధిలోని శ్రీకంఠపురంలో వెలసిన శ్రీకంఠేశ్వర ఆలయంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డిలను ఆలయ అర్చకులు ఆహ్వానించారు. ఈ మేరకు వారు పార్టీ కార్యాలయానికి వెళ్లి బుధవారం జరిగే ఆకు పూజ, రుద్రాభిషేకం, ప్రాకారోత్సవం కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ముస్తాబైన శైవక్షేత్రాలు



పెనుకొండ: విద్యుత్ దీపాల మధ్య వెలిగిపోతున్న శివుడి విగ్రహం

పెనుకొండ: పట్టణంలోని భోగసముద్రం చెరువు దగ్గర కొలువైన శివుని విగ్రహం వద్ద నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భోగసముద్రం చెరువు ముఖద్వారంలో వద్ద భక్తులు, ప్రజలను ఆహ్వానిస్తూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

అమరాపురం: మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలను ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నయి. రాత్రి జాగరణ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పావగడ: మహాశివరాత్రిని పురస్కరించుకుని తాలూకాలోని ప్రఖ్యాతి చెందిన పర్యాటక కేంద్రం కామన దుర్గం కొండపై వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. అదే విధంగా వైఎన్ హొసకోటలోని కోటేశ్వరస్వామి, చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయం, పట్టణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయాల్లోనూ ఏర్పాట్లు పూర్తి చేశారు.



పావగడ: అలంకరణలో రామలింగేశ్వరస్వామి

గోడౌన్‌లో అగ్ని ప్రమాదం



ప్రమాద స్థలంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది



కాలిపోతున్న బంకు

పెనుకొండ: పట్టణంలోని యాడికి నాగరాజు గోడౌన్‌లో మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గతంలో రిజ్వాన్ అనే వ్యక్తి గోడౌన్‌ను బాడుగకు తీసుకుని అందులోని ఖాళీ స్థలంలో కియా అనుబంధ సంస్థల్లోని రబ్బర్, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను డంప్ చేశారు. అయితే ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. సమాచారం అందుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రమాదంలో రూ.50 వేల మేర నష్టం సంభవించి ఉంటుందని ఫైర్ సిబ్బంది తెలిపారు.

మూడు పెట్టె అంగళ్లు దగ్ధం

రొళ్ల: మండల కేంద్రంలోని మధూడి ప్రధాన రోడ్డు పక్కన ఉన్న మూడు పెట్టె బంకులు మంగళవారం అగ్నికి ఆహుతయ్యాయి. బంకుల పక్కనే పట్టణ వాసులు చెత్తా చెదారాన్ని రోజూ పడేసేవారు. ఈ క్రమంలో చెత్తకుప్పకు నిప్పంటుకోవడంతో స్థానికులు మంటలు ఆర్పేశారు. అయితే కొద్ది సమయం తర్వాత చెత్త కుప్పలో అగ్గి రాసుకుని పక్కనే ఉన్న మూడు (అంగళ్లు) బంకులకు తాకి మంటలు వ్యాపించాయి. మంటలను అదుపు చేసేందుకు స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బందికి అక్కడికి చేరుకునేలోపల అంగళ్లు కాలిబూడిదయ్యాయి. విజయ్‌కుమార్ చెందిన టైలర్‌షాప్, నాగరాజప్పకు చెందిన హెయిర్ కటింగ్ షాపు, గౌస్‌కు చెందిన గుజరి సామాన్లు భద్రపరిచిన షాపులు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రూ.80 వేలకు పైగా నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ



హిందూపురం: జ్ఞానజ్యోతి శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీలు

పరిగి: మండలంలోని సేవా మందిరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఎంఈఓ శేషాచలం మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను రాబోయే సంవత్సరంలో అంగనవాడీ సెంటర్లలో అమలు పరిచి విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కృపా సత్యరాజు, జ్యోతిర్మయి, శ్రీధర్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరురోజులుగా అంగనవాడీ వర్కర్లకు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ముగింపు శిక్షణ కార్యక్రమానికి ఎంఈఓ శ్రీధర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక అభివృద్ధితో పాటు కళాత్మక విద్యను బోధించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, ట్రైనర్లు హరిప్రసాద్, నారాయణస్వామి, కేశవప్రసాద్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: పట్టణ, మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక ఎంజీఎం పాఠశాలలో ఆరు రోజుల పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో మంగళవారంతో ముగిసింది. కోర్స్ డైరెక్టర్, ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో విద్యార్థుల స్థాయికి దిగి బోధించాలన్నారు. సీడీపీఓ శాంతి , ఎంఈఓ ప్రసన్నలక్ష్మీ, ఎంజీఎం హెచ్‌ఎం సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో అలసత్వం వద్దు

చిలమత్తూరు: నిత్యావసరాల పంపిణీలో అలసత్వం ప్రదర్శించకుండా పారదర్శకంగా లబ్దిదారులకు అందజేయాలని డీలర్లకు డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్ సూచించారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని చౌకధాన్యపు డిపో డీలర్లతో సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో లాగా ఎండీఎం వాహనాల ద్వారా ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ డీటీ శ్రీధర్, డీలర్లు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను కొనసాగించాలని నిరసన



పోస్టు కార్డులను ముఖ్యమంత్రికి పంపుతున్న మున్సిపల్ కార్మికులు

హిందూపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు కాంట్రాక్ట్ కార్మికులను అప్పగించడం తగదని, ఆ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. పోస్ట్ కార్డులను పోస్టల్ కార్యాలయంలోని పోస్ట్ బాక్స్‌లో వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ కార్యదర్శి జగదీష్, అధ్యక్షుడు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, సహాయ కార్యదర్శి చంద్ర తదితరులు పాల్గొన్నారు.